భయం...భయం

"మనుషులు మృగాలకు భయపడితే అర్థం వుంది.

మనుషులు తోటి మనుషులకు భయపడడం అది మన సమాజానికి ఎంత అవమానం?"

—జయప్రద

కారు స్పీడ్‌గా, మెత్తగా నిర్భయంగా ఆ డబల్ రోడ్డుమీద దొర్లిపోతోంది. కానీ కార్లో ముందుసీట్లో కూర్చున్న వ్యక్తుల ముఖాల్లో ఆందోళన.

"అంత స్పీడెందుకండి. కాస్త మెల్లిగా పోనివ్వండి" ధరిత్రి భర్తతో కొద్ది విసుగ్గా, కొద్ది అర్థింపుగా అంది.

అతను రోడ్డువైపునుండి చూపు మరల్చలేదు. నోరెత్తలేదు. కారు వేగం తగ్గలేదు. భాస్కరుడుకూడా వేగంగా పడమట దిక్కున ఆకాశ మార్గంనుండి సముద్రమార్గంలోకి ప్రయాణం చేస్తున్నాడు.

"చెప్తే వినాలి-అంత మొండితనమెందుకు? ఇంకో పది నిము షాలు లేటుగా వెళతాం! ఏం మునిగిపోతుంది?"

"ప్రొద్దుపోతే రోజులు బాగలేవు. దూరప్రయాణం తొందరగా తెమలమని చెప్పాను. విన్నావా? అప్పుడే ఆరయిపోయింది. ఇంకా మూడు గంటలసేపు ప్రయాణముంది."

మాట్లాడలేదు ధరిత్రి.

కొద్దిగా వేగం తగ్గించాడు గాంధీ.

"పగలు ఎండలో ప్రయాణం కంటే ఈ టైమ్‌లో కారు జర్నీ బావుంటుంది" ధరిత్రి మెల్లిగా అంది.

"నిజమే. నిజమే ధరిత్రీ. కానీ రోజులెలా వున్నాయి. పది రూపా యలున్న పర్స్ కోసం పరమ కిరాతకంగా ప్రాణాలు తీస్తున్న దారి దోపిడీ మనుష్యులు తయారయిన రోజులివి. పైగా నేనొక్కణ్ణి అయితే ఫర్వాలేదు."

ఎదురుగా లారీ స్పీడుగా వస్తోంది.

"నిజమే! ఆడ, మగ ఏముందిలే. మీరు ఏ రోజయినా యింటికి రావడం ఆలస్యమయితే నామనసు మనసులో వుండదు. సవాలక్ష అనుమా నాలు" భర్తకు కాస్త దగ్గరకు జరుగుతూ అంటున్న భార్య భుజంమీద ఎడంచెయ్యి వేసి కుడిచేత్తో స్టీరింగ్ తిప్పుతున్నాడు.

"బయటకు వెళ్ళాక లక్షణంగా తిరిగి యింటికి వస్తామనే ధైర్యంలేని రోజులయిపోయాయి.

మొన్న మావాడు కిరణ్ లేడూ! వాడు కల్లాంలో వడ్లు అమ్మి స్కూటర్ తీసుకుని యింటికొస్తుంటే నలుగురు మనుష్యులు అటూ యిటూ నిల్చుని కర్రలెత్తి కొట్టి కదూ డబ్బు తీసుకెళ్ళింది."

భయంగా చూసింది ధరిత్రి.

"అప్పుడు గంట పడన్నా కాలేదు. మగవాడు ఏడుగంటలకే గూడు చేరాలంటే ప్రతిరోజూ ఎలా వీలవుతుంది?"

"మీకెప్పుడయినా అలా తటస్థిస్తే ముందే డబ్బిచ్చి వాళ్ళ మొహాన పారేయండి. పాడు డబ్బు పోతే పోయింది. తగలరానిచోట దెబ్బ తగిలితే ఇంకేమయినా వుందా?"

సడెన్‌గా కారు స్పీడు తగ్గిపోయింది. క్లచ్‌వేసి గేర్లు మారుస్తున్నా డతను.

"ఏమైంది?" బెదిరిపోతూ అడిగింది ధరిత్రి. ఆమెకు కారెక్కడ ఆగిపోతుందోనని భయంగా వుంది.

అమ్మా నాన్నల భయం చూస్తే నవ్వుగా వుంది పదిహేడేళ్ళ అశ్వనికి.

వెనుక సీట్లో కూర్చుని ఇంగ్లీషు నవల చదువుకుంటున్న ఆ టీనేజ్ అబ్బాయి ఒకసారి తలెత్తి చూసి మరలా నవలలో మునిగి పోయాడు.

"ఏంలేదు. మన ప్రాణానికి ఈ స్పీడ్‌బ్రేకర్స్ ఒకటి. ఎంబాసి డర్ కారు కాబట్టి సరిపోయింది.

ఫియట్‌కయితే టాంక్ తగలాల్సిందే అంత అందంగా వేసాడు. వెహికల్స్ గుల్లయిపోతున్నాయి."

రోడ్డువైపు వెనక్కు తిరిగి చూసింది ధరిత్రి.

"పైగా వాటి మొహాన తెల్లరంగు కొట్టాడా అంటే అదీ లేదు. దగ్గరకొచ్చేదాకా కనిపించి చావవు. సడన్‌బ్రేకులు, వెనుక వెహికల్స్ గుద్దుకోవడాలు అసలివి స్పీడ్ బ్రేకర్సో యాక్సిడెంట్ మేకర్సో అర్థం కాదు."

"నిజమే డాడీ! మెయిన్‌గా రైల్వే లెవల్ క్రాసింగు దగ్గర వేస్తు న్నారు స్పీడ్ బ్రేకర్స్. చూసి తీరాలి మమ్మీ చిన్న చిన్న స్పీడ్ బ్రేకర్స్

నాలుగయిదు ఏడుస్తున్నాయి. గేట్ క్లోజ్ వేసే టైముకి రిక్షాలు, ఆటోస్ గేటు దాటేయాలనే ఆత్రుతలో స్పీడ్‌గా వెళ్ళడం వెహికల్ ఆటూ యిటూ వూగి ఒకదాన్నొకటి గుద్దుకోవడం చూస్తుంటే భలే నవ్వొస్తుంది మమ్మీ."

"ఛ! నోర్మూసుకోరా! వాళ్ళూ వాళ్ళు గుద్దుకుంటుంటే నీకూ నవ్వులాటగా వుందా?"

నవ్వాడు గాంధీ.

"ఉడుకురక్తం ధర్త్రీ! అందుకే వీడింత గొడవపెడుతున్నా స్కూటర్ కొనివ్వంది."

"ఇంటర్ పూర్తయ్యాక కూడా కొనివ్వరా" నిష్ఠూరంగా అంటున్న కొడుకువేపు తల తిప్పీ తిప్పనట్లు తిప్పి చూసి.

"ఇంటర్ కాదు నీకు పెళ్ళయ్యే దాక స్కూటర్ కొనివ్వను. మొన్న మీ ఫ్రెండ్ స్కూటర్‌లో ఎంత స్పీడ్ వెళుతున్నావ్ నువ్వు. నువ్వు ఆ రోజు కారులో లేవుగాని ధర్త్రీ వాడిని-ఛేస్ చేసి ఆపి అక్కడే చీవాట్లు పెడదామనుకున్నాను. వీడి ఫ్రెండ్స్ స్కూటర్ వెన కున్నాడులే బాగుండదని వూరుకున్నాను."

"థాంక్స్ డాడీ! కానీ యాక్సిడెంట్ అవడమనేది క్రైమ్. అంతే మనం ఎంత స్లోగా పోతున్నా జరిగే యాక్సిడెంట్స్ ఎలాగూ జరుగు తాయి. అవతలివాడు తాగి డ్రయివ్‌చేసి కొడితే మనమేం చేయ గలం?"

"అందుకే నీకిప్పుడే కొనివ్వనంటున్నాను. మనం జాగ్రత్తగా వుంటే కొన్ని యాక్సిడెంట్లయినా తప్పుతాయి" టర్నింగ్‌దగ్గర స్లో చేసి మరలా యాక్సిలేటర్ నొక్కుతూ అన్నాడు గాంధీ.

అశ్విని మాట్లాడలేదు. అతనికి తల్లిదండ్రులమీద చాల కోపంగా వుంది.

స్కూటర్ కొనుక్కుని నెల్లూరునుండి జామ్ జామ్ అని హార్సిలీ హిల్స్‌కి నేరుగా వెళ్ళాలనే ఆరాటం యీ నాటిదికాదు ఏడో తరగతి నుండి పెరుగుతూ వస్తోంది

హార్సిలీహిల్స్‌లో స్టడీస్ కూడా పూర్తయ్యాయి. మదనపల్లిలో కాలేజీలో చేరినా ఇంకా పోస్ట్‌పోన్‌మెంటే!

"మరి పెళ్ళయ్యాక ఎలా కొనిస్తారు?" నవ్వుతూ అడిగింది.

"ధరిత్రి అప్పుడంటే కడుపులో భయం వుంటుంది. తనకేమైనా అయితే భార్య ఏమయిపోతుందోనని" చిన్నగా నవ్వుతూ అన్నాడు గాంధీ.

"మీరూ అంతేనా" చిలిపిగా చూస్తూ భార్య అనడం కంటి కొసల నుండి అతనికి కనిపిస్తూనే వుంది.

"అంతే మరి శ్రీమతి మహత్యం అలాటిది"

కవ్వింపుగా ఏదో అనబోయిన ధరిత్రి మాటలు గొంతులోనే ఆగిపోయాయి. ఆమె గుండె జల్లుమంది.

పదిగజాల దూరంలో రోడ్డు కడ్డంగా మనిషి. గాంధీ కారు వేగం తగ్గించలేదు. క్షణంలో కారు అతనిమీదుగా వెళ్ళిపోయేదే! ధరిత్రి కళ్ళు గట్టిగా మూసుకుంది.

కానీ కారు అతని కెదురుగా వెళ్ళలేదు.

అతను కొద్దిగా ప్రక్కకు తప్పుకున్నాడు. కారు అతనిప్రక్కగా జారిపోయింది. ధరిత్రి కళ్ళు తెరిచింది. యూనిఫామ్‌లో వున్న అతను అరుస్తున్నాడు.

"హెల్ప్.... హెల్ప్"

అయినా గాంధీ కారాపలేదు.

"మీరు మరీ డాడీ పాపం జాకీ ఏదయినా అవసరమేమో!"

"నువ్వు నోరుమూసుకోరా" ధరిత్రి కసిరింది. "జాకీ యిస్తూ కూర్చుంటే ప్రొద్దు పోతుంది"

"జాకీ అయితే ఇవ్వొచ్చు ధరిత్రీ. కానీ కార్లు ఆపి దోపిడీలు చేస్తున్నారు"

"అతను పోలీసు కానిస్టేబుల్ డాడీ"

"కావచ్చు" కొద్దిగా తల తిప్పి మరలారోడ్డువైపుకు చూపుసారిస్తూ అన్నాడు గాంధీ.

"పోలీస్ యూనిఫారమ్‌లో వచ్చి దారి కాచి దోచుకున్న వాళ్ళ సంగతి పేపర్‌లో చదవలేదా అశ్వనీ"

"పేపర్‌లో ఏంటిలే డాడీ. జరుగుతున్నాయనుకోండి. అన్నట్టు మొన్న కొడవలూరులో జరిగిన ఘోరం తెల్సా మమ్మీ! ఆ నలుగుర్లో పారిపోయిన వాడు మా ఫ్రెండ్ స్కూటర్ కడ్డంగా తాడు పెట్టేసారట. వాళ్ళు పడిపోయాక తూములోకి తీసుకెళ్ళడం వీడు కళ్ళారా చూసాడట. ఎలాగో తప్పించుకొచ్చాడు. ఇలాటివన్నీ జరుగుతున్నాయనుకోండి. కానీ క్షణ క్షణం ఇలా అనుమానపడుతూ భయపడుతూ వుంటే బతికేదెట్టా"

"చాల్లేవయ్యా ఆ మోటు ధైర్యమే నా కిష్టంలేంది. రోజులుమారే వరకు కాస్త జాగ్రత్తగానే వుండాలి"

"రోజులు మార్తాయంటావా?"

"మారవంటారా?" భర్త వైపు దిగులు పడుతూ చూసింది ధరిత్రి.

ఎదురుగా లారీ వస్తోంది. కారు ముందు మరో లారీ వెళుతోంది. ఆ లారీని క్రాస్ చెయ్యడానికి హారన్ ఇస్తున్నాడు గాంధీ.

"వొద్దొద్దు. ఆపండి. ఆ ఎదురు లారీ వెళ్ళిపోనివ్వండి" అంటూనే వుంది.

"చాలా స్పేస్ వుంది." అంటూనే క్రాస్ చేసేసాడు గాంధీ. క్రాస్ చేసి నాలుగు గజాలు వెళ్ళారో లేదో! రోడ్డు ప్రక్కన నిల్చున్నామె హఠాత్తుగా రోడ్డులో కొచ్చేసింది. ఆమెను తప్పించను ఎడమవైపు వెళితే ఆమె భయపడి వెనక్కొచ్చింది ఆమెను తప్పించి కారు కుడివైపు కొచ్చేసరికి ఎదురుగా బస్. ధరిత్రి గట్టిగా కళ్ళు మూసుకుంది. అశ్విని గట్టిగా అరిచేసాడు.

"డాడీ!"

ఎడమవైపు వెళితే ఆ మనిషి ప్రాణం. కుడివైపు వెళితే బస్‌ని గుద్దేయడం ఖాయం. డ్రైవర్ మేధస్సుకు పని తగిలే క్షణాలవి. గాంధీ స్టీరింగ్‌ను పూర్తిగా కుడివైపు తిప్పేసాడు. మరుక్షణంలో కారు పొలాల్లో వుండాలి ముగ్గురూ నిర్జీవులై మిగలాల్సిన టైమ్. రోడ్డు పూర్తి అంచు నుంచి ఎడమ వైపుకు తిప్పాడు. క్షణాల్లో చాలా పెద్ద యాక్సిడెంట్ తప్పింది. ఎదురు బస్ కారుని రాంగ్‌సైడ్ క్రాస్‌చేసి ఆగింది. కారాపాడు గాంధీ. తను వచ్చింది రాంగ్‌రూట్. బస్ డ్రయివర్‌కు సంజాయిషీ చెప్పాల్సిన బాధ్యత వుంది కానీ గాంధీ వూహించినట్టు ఎవ్వరూ ఏమీ అనలేదు. కారు కడ్డంగా డాన్స్ చేసిన ఆ మనిషిని దులిపేసారు.

గాంధీ బస్ డ్రయివర్‌కు థాంక్స్ చెప్పాడు.

"మీరు తెలివిగా బస్‌ని రాంగ్ సైడ్ తిప్పారు. లేకపోతే నాకి అవకాశం మిగిలేదికాదు."

"నేను దూరం నుండే ఈ మనిషి డాన్స్ చేయడం చూసాను. మీ రూట్ గమనించి స్లో చేసి రైట్ కొచ్చాను"

"సారీ రాంగ్‌రూట్ కెళ్ళడం నాకు తప్పలేదు"

"మీరు బాగా డ్రయివ్ చేసారు సార్. మేము చూస్తూ వుండగానే జరిగింది కదా! ఆ స్పీడ్‌లో చాలా బాగ కంట్రోల్ చేసారు"

చిరునవ్వు నవ్వాడు గాంధీ.

"లేచిన వేళావిశేషం మంచిది" భర్తను కళ్ళనిండా చూసుకుంటూ గుండెలమీద చెయ్యి వేసుకుని అంది ధరిత్రి.

"అంతేకానీ డాడీ డ్రయివింగ్ నైపుణ్యం కాదంటావ్" తల్లికంటే ముందుగా కోలుకున్న అశ్విని నవ్వుతూ అన్నాడు.

"ఏదో లేరా గండం గడిచి బయట పడ్డాం"

"అంతా టైమ్ ధరిత్రీ. ఎంతమంచి డ్రయివరయినా ఒక్కోసారి ఏమీ చేయలేం. అదే టైమ్‌లో నా వెనుక నేను క్రాస్ చేసిన లారీ అక్కడ ఆగకుండా స్పీడ్‌గా వెనుక వచ్చుంటే అతను ఎటు వెళ్ళాలి? ఎడం వైపొస్తే బస్, కుడి వైపొస్తే కారు ఎవర్నో ఒకర్ని గుద్దాల్సిందే"

"ఏదోలెండి ఇంక గుర్తు చేయకండి"

గాంధీ అయితే భార్య కోరిక ప్రకారం మరో మాట మాట్లాడ లేదు. కానీ ఆ సంఘటనను మరోసారి గుర్తు చేస్తూ రెండు మూడు ఫర్లాంగుల తర్వాత లారీ ఏక్సిడెంట్, లారీ పొలం ప్రక్కనున్న కాలువలో వెల్లకిలా పడుంది. వినిరేనిసట్టు కొంత దూరంలో నాలుగు శవాలు ప్రక్కన పోలీస్. ఫ్రెష్‌గా జరిగిన యాక్సిడెంట్‌లా వుంది. కారు ఆపాడు గాంధీ.

"వద్దు పోనివ్వండి" భయంగా అంది ధరిత్రి.

"ఒక్క నిముషం ధరిత్రీ" డోర్ ఓపెన్ చేసాడు. తండ్రి దిగడం కోసమే ఎదురు చూస్తున్నట్టు చెంగున దిగాడు అశ్విని.

వద్దను కుంటూనే అటు చూసింది ధరిత్రి.

ముగ్గురు మగవాళ్ళు ఒక స్త్రీ ఇంట్లో ఎంత అపురూపంగా చూసుకునే శరీరాలివి. ఎంత అనాధలుగా ఆ మట్టిలో, ముళ్ళలో, గడ్డిలో అడ్డదిడ్డంగా–ధరిత్రి మనస్సంతా దిగులుతో నిండిపోయింది. వీళ్ళచుట్టూ

అల్లుకున్న జీవితాలిక ఎలా స్తంభించి పోతాయో! వాకిట్లోకి అపరిచితులయిన మగవాళ్ళొస్తే పైట కప్పుకుని లోపలికెళ్ళే భారత స్త్రీ చీర తొలగి పోయి ఇంతమంది మగవాళ్ళ మధ్య ఎంత వికృతంగా, ఎంత దయనీయంగా పడుంది.

ధరిత్రి గుండె జల్లు మంది.

మరోలా జరుగుంటే కొన్ని క్షణాలక్రితం తనూ, తన భర్త తన బిడ్డ అనాధులుగా, శవాలుగా ఆ పొలాలమధ్య-మరి వూహించలేక పోయింది ధరిత్రి. కానీ వద్దనుకున్నా ఆమె నవి వదలడం లేదు. తను చనిపోతే ఇంట్లో వున్న పదేళ్ళ ప్రవీణ, పన్నెండేళ్ళ మధు ఏమయి పోయేవాళ్ళు. చెట్టుకొకరు, పుట్టకొకరుగా 'ఈయనతో చెప్పాలి-యాక్సిడెంట్ జరగదని గ్యారంటీ ఏమిటి? పసివాళ్ళని కొట్టి పారేయకుండా పిల్లలందర్నీ కూర్చోబెట్టుకుని ఏ అస్థులు ఎక్కడున్నాయో చెప్పమని.

గాంధీ, అశ్విని పోలీస్‌తో ఏదో మాట్లాడి వస్తున్నారు.

ఇప్పుడు సజీవంగా నడిచొస్తున్నవాళ్ళు, తను ఆ శవాల స్థితిలో వుండాల్సిన వాళ్ళన్న మాట. వాళ్ళు కూడా కొన్ని గంటల ముందు సజీవంగా వున్నవాళ్ళేకదా.

తనని గాంధీని ఒక పాడిమీద తీసుకెళ్ళేవాళ్ళు కాబోలు. పెళ్ళి పీటలమీద కల్సిన తాము జంటగా చచ్చిపోవడం అది ఎంతదృష్టం. కానీ కార్లో అశ్విని-! ఎంత చిత్రం! తాము చనిపోయాక కూడా బిడ్డలు చనిపోకూడదనే ఫీలింగ్‌న్యాయానికి అదెంత అనవసరం ఆమెకు.

"డ్రయివర్, క్లీనర్ పాపం ఎవరో జంట పెళ్ళి కెళ్ళడానికి బస్ దొరకక లారీ ఎక్కారట" చెపుతూ డోర్ మూసి క్లచ్ నొక్కి కీ ఆన్ చేసి యాక్సిలేటర్ కొద్దిగా ఇచ్చి ఫస్ట్ గేర్‌లో కెళ్ళాడు గాంధీ.

"అది వీళ్ళకేం తెల్సు?"

"ఏమో వాళ్ళు చెపుతున్నారు"

"ఇలాంటప్పుడు కథలు చాలా అల్లుతారు. రేపు పేపర్ లో చూస్తే తెలుస్తుంది."

"పాపం. ఈ ప్రయాణమే లేకపోయినా, బస్ దొరికున్నా వాళ్ళిద్దరూ మిగిలుండేవాళ్ళు. పసివాళ్ళలా వున్నారు పాపం"

"ఓకే. లీవిట్....ఇలాటి వెన్నో."

బుక్ తెరిచాడు అశ్వని. పడమట దిక్కున ఆకాశమంతా ఎర్రటి కాంతి. సూర్యుడు ప్రయాణాన్ని మరో దిక్కుకు తిప్పుతున్న క్షణాలవి.

హిచ్‌కాక్. కలం వదిలిన అక్షరాలు ఆ మసక వెలుగులో కన్పించడం లేదు. పుస్తకం మూసేసాడు అశ్వని.

చాలా కష్టంమీద జనాన్ని తప్పించుకుని కాళహస్తి దాటింది కారు. హెడ్‌లైట్స్ ఆన్ చేసాడు గాంధీ.

"వీడిని నెల్లూరులో చేర్పిస్తే ఏం? మాటిమాటికీ ఈ మదనపల్లి ప్రయాణాలు రైలు రూటు లేదు" జరిగిన రెండు ఇన్సిడెంట్స్ తాలూకు ఫోబియాతో మాట్లాడుతోంది ధరిత్రి.

"ఇంకెంతలే ఒన్ ఇయర్. పూర్కే మార్చకూడదు. ప్రొఫెషనల్ కోర్సు కెళితే ఎలాగూ తప్పదు. లేకపోతే డిగ్రీ సర్వోదయాలో చేర్పిద్దాంలే!"

కారు సగం రోడ్డులోకొచ్చింది. నిదానంగా పోతున్నాడు గాంధీ.

ఎదురుగా లారీ వాహనం. రోడ్డు మధ్యగా దేదీప్యమానంగా హెడ్‌లైట్ల కాంతి, ఎదురు రోడ్డు కనిపించటంలేదు. వచ్చే డ్రయివర్ ఒక్క ఇంచికూడా రోడ్డు దిగడంలేదు.

"డిమ్ డిప్ వాడనే వాడరు ఇడియట్స్" కారు బాగ స్లో చేశాడు గాంధీ.

లారీ భయంకరంగా రోడ్డు మధ్యగా లైట్లు ఆరకుండా వస్తూనే వుంది. మీది మీదికి వస్తోంది.

"తాగున్నాడేమో రాస్కెల్!" భయంగా చూసింది ధరిత్రి.

గాంధీనికూడా ఆ ఫోబియా వదలలేదు. సెకండ్ గేరేలో కొచ్చి రోడ్డు దిగేసి కారు ఆపేసాడు. ఇంజన్ మాత్రం రన్ అవుతోంది.

"కావాలని చేస్తున్నాడా?" కారు ఆగేలా చేసి, కారు ఎదురుగా ఆపి, తమని దోచుకోవడానికొస్తున్న డెకాయిట్స్ కాదు కదా!" అందరి గుండెల్లో అదే ఆలోచన.

గాంధీ సిద్ధంగా వున్నాడు. గాంధీ కాలు యాక్సిలేటర్‌మీద సర్వ సన్నాహంలో వుంది.

గేర్‌మీద ఓ చెయ్యి, స్టీరింగ్‌మీద మరోచెయ్యి, క్లచ్‌మీద రెండో కాలు.

ఒకవేళ అదే జరిగే పరిస్థితులే వస్తే బాగా సైడుకి లాక్కుని కారుని లాగేయడమే, ముందేమున్నా సరే.

ఆలోచన పూర్తికాకముందే మహారాజులాగ ఒక్క అంగుళం కూడ రోడ్డు దిగకుండా డిమ్ డిప్ కొట్టే శ్రమ డ్రయివర్ చేతుల కివ్వకుండా లారీగారు దాటి వెళ్ళిపోయారు.

"పొగరుబోతు వెదవ. ఎంత భయపెట్టాడో!"

ఎలక్ట్రానిక్ రిస్టువాచ్ స్విచ్ నొక్కి టైము చూసాడు అశ్విని. ఇంకా ఏడన్నా కాలేదు.

అశ్వనిలో కూడ చిన్న భయం. మరలా టీనేజ్ అభిజాత్యం. తను భయపడేదేమిటని?

అందుకే తల్లి, "వద్దండీ తిరుపతిలో ఆగిపోదాం. రేప్రొద్దునే బయలుదేరితే కాలేజీ టైంకి అందుకుంటాడు అశ్వని" అని అన్నప్పుడు....

"అంత భయపడితే ఎలా మమ్మీ?" అన్నాడు.

"నేను మరలా రేపు మధ్యాహ్నానికి నెల్లూరులో వుండాలి ధరిత్రీ. లేకపోతే భీమాలో దిగేసి ప్రొద్దున్నే వెళితే స్ట్రెయిన్ కూడా తగ్గుతుంది."

కానీ ధరిత్రి ఒప్పుకోలేదు. గాంధీ కారు భీమా డీలక్స్ లాడ్జిదగ్గర ఆగింది.

* * * *

ఆఫీసర్స్ క్లబ్ లో ఎంటరయిన గాంధీకి "కూర్చోండి" విష్ చేసి మర్యాదగా కుర్చీ ఆఫర్ చేసాడు పోలీస్ సూపరింటెంట్ మిస్టర్ వేణుమాధవ్.

"ఎ. పి. యస్. ఫియట్ మీదేననుకుంటాను. కాఫీ తీసుకుంటారా?"

"నో థాంక్స్."

చిన్నగా నవ్వాడు వేణుమాధవ్.

"మీరేమీ అనుకోకపోతే మీరు తిరుపతివేపుగా ఈ నెల ఆరవతేది వెళుతున్నారు. ఓ కారు చెడిపోయి మీ సహాయం అర్థించారు. మీరు ఆపకుండా వెళ్ళిపోయారు. అవునా?"

గాంధీకి గుర్తువచ్చింది.

"అది మీ కారా?"

"అవును"

"అయామ్ సారీ, మీ కారనుకోలేదు"

అతను చిన్నగా నవ్వాడు.

"దట్సాల్‌రైట్. కానీ మా కారేకాకపోవచ్చు. సహాయం అవసరమయిన వాళ్ళకి మన చేతిలో వున్న సహాయం చేయాల్సిన డ్యూటీ యీ దేశ పౌరుడిగా మీకు లేదా?" నవ్వుతూనే చురక వేసాడతను.

గాంధీ మాట్లాడలేదు.

"ఆ కారులో ఓ నిండు నెలల మనిషి కాన్పుకాక కష్టపడుతుందనుకోండి. ఆ కారు మధ్యలో ఆగిపోయింది. ఏ వెహికల్ ఆమెను ప్రక్కనున్న హాస్పిటల్‌కు తీసుకెళ్ళే ఔదార్యం చూపించకపోతే ఆమె ఏమైపోవాలి?"

గాంధీ తలవంచుకున్నాడు.

"ఓ హార్ట్ అటాక్ పేషెంట్, నూటారు డిగ్రీల జ్వరం ముంచుకొచ్చిన మనిషో, అందులో వున్నాడనుకోండి, ఓ పది నిముషాలు వృధా అవుతాయని మీరనుకుని వెళ్ళిపోతే వాళ్ళ ప్రాణాలే ఖర్చయిపోతాయికదా! మీరదే రూట్‌లో వెళుతున్నారు. మీకు ఎగస్ట్రాగా పెట్రోలు ఖర్చు కాదు.

హాస్పిటల్ తీసుకెళ్ళను ఒక్క లీటర్ పెట్రోలు తప్ప ఏమంటారు?"

తలెత్తాడు గాంధీ.

"మీ తిరస్కారంవల్ల నేను మరో కొంతసేపు అక్కడ నిల్చి పోవాల్సి వచ్చింది. దానివల్ల కొంత కష్టమే కానీ నష్టం ఏమీ లేదు, కానీ మిష్టర్ గాంధీ...."

"సర్!"

"అఫ్‌కోర్స్. ఐకెన్ అండర్‌స్టాండ్. అందరికీ లిఫ్ట్ యిమ్మని నేను చెప్పను. ఓ నిముషంసేపు కారాపితే అది అత్యవసర పరిస్థితి అయితే ఇవ్వండి. లేదంటే యువర్ విల్ యండ్ ప్లెజర్. మీరు ఇవ్వాల్సిన అవసరంలేదు.

"కానీ సర్!"

"మీకెంతో అవసరంగా వెళ్ళాల్సిన పని వుండి వుండొచ్చు కానీ ఓ నిముషం అంతే. అత్యవసరమైన లిఫ్టు కాదనిపిస్తే మీరెళ్ళిపోవచ్చు. ప్లీజ్ మీరు అఫెండ్ కావద్దు."

"థాంక్స్! బట్ మీకు నేను చెప్పక్కరలేదు. కానీ మీకెందుకో ఆ ఆలోచనరాలేదు."

వేణుమాధవ్ ఆశ్చర్యంగా చూసాడు.

"సర్! మీరేమీ అనుకోకపోతే, దారిలో నిల్చుని దీనంగా చూస్తూ చెయ్యెత్తి కారు ఆపమనగానే ఆపగలిగే ధైర్యం మీ డిపార్టుమెంట్ మాకివ్వలేదు."

"వాట్ డు యు మీన్ మిష్టర్ గాంధీ!"

"మీ కర్థంకావాలి సర్!" నవ్వాడు గాంధీ.

"నిశ్చింతగా రాత్రిపూట ప్రయాణం చేయలేని రోజుల్లో ఎక్కడ రోడ్డు కడ్డంగా రాళ్ళు పెట్టి ఆపుతారో! అనే భయాన్ని గుండెల్లో నిలుపుకుని ప్రయాణం చేస్తున్న ప్రయాణీకులు కారు ఆపి లిఫ్ట్ యివ్వ గలరంటారా?"

"అందరూ అలాటివాళ్ళే వుంటారా?" సన్నగా నవ్వాడు వేణు మాధవ్.

"వుండరు. నేను ఒప్పుకుంటాను. కానీ ఎదురుపడే మోసగాళ్ళ వల్ల నిజాయితీపరులనుకూడా అనుమానిస్తున్నట్టే-తప్పదు సార్. దారి దోపిడీ వాళ్ళను మీరు హతమార్చిందే ప్రయాణీకులు రెండు విధాలుగా నష్టపోవాల్సిందే!"

అతను మాట్లాడలేదు. రెండు విధాలు అనే పదంమీద ఆలోచిస్తు న్నట్లున్నాడు.

"మీకు లిఫ్ట్ యివ్వకుండా వెళ్ళిపోతున్న మా అసహాయతకు చింతించాల్సిందే. ఇంకో నాలుగు గజాల దూరం వెళ్ళాక, ఏమో! మా వెహికల్ ఆగిపోవచ్చు. అలాంటప్పుడు సహాయం అందక అల్లాడి పోవచ్చు."

"వెల్ మిష్టర్" అతను నిట్టూర్చాడు.

"ఐ కెన్ అండర్‌స్టాండ్ యువర్ ఫియర్స్ కానీ వాళ్ళను నామ రూపాల్లేకుండా చేయడానికి మేము ప్రయత్నిస్తున్నాం."

"నేను కాదనడం లేదు సర్! కానీ మీరేమీ అనుకోకపోతే.... అపార్థం చేసుకోకపోతే...."

"చెప్పండి. ఐ ఆల్‌వేస్ట్ వెల్‌కం గుడ్ సజెషన్స్—సందేహించ కండి. మీరు చెప్పేది నేను మంచి సెన్స్‌తో తీసుకుంటాను."

"మీరు దారిదోపిడీ మనుషుల్ని ఎంతో శ్రమ తీసుకుని నామ రూపాలు లేకుండా చేయక్కర లేదుసర్. మద్దతు ఇచ్చేవాళ్ళున్నప్పుడు తప్పులు చేసే వాళ్ళకు కొదవేముంది? మీ డిపార్ట్‌మెంటులో వుండే కలుపు మొక్కల్ని ఏరేసి డిపార్ట్‌మెంటు నుండి తొలగించండి. అప్పుడు దారికాచే వాళ్ళు మీకు మచ్చుకు కూడా కన్పించరు."

ఆలోచనలో పడిపోయాడతను. గాంధీ లేచాడు. అతనికి విష్ చేసి పీడ్కోలు తీసుకుని అర్ధాంతరంగా కారెక్కాడు.

❋